## మెరుగైన వైద్యం అందించాలి



జనతా దవాఖానను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(అక్బర్‌పేట-భూంపల్లి), జనవరి 3: వైద్యులు గ్రామాల్లో మెరుగైన వైద్యం అందించి మన్ననలు పొందాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆకాంక్షించారు. బుధవారం అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో జనతా ప్రైవేట్ దవాఖానను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి గ్రామీణ ప్రాంతంలో ప్రైవేట్ దవాఖాన నెలకొల్పడం సంతోషంగా ఉన్నదన్నారు. ధనార్జనే ధ్యేయంగా పని చేయకుండా పల్లెల్లోని పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో జనతా దవాఖానను నెలకొల్పారన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సర్పంచ్ ధర్మారం స్వరూప భిక్షపతి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రవి, డాక్టర్లు తాజుద్దీన్, కిశోర్, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్గువకు స్కూటీ వస్తుందని..

హత్నూర, జనవరి 3: అగ్గువకు స్కూటీ వస్తుందని ఆశతో ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించి మోసపోయిన ఓ యువకుడు మంగళవవారం సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించారు. వివరాల్లోకి వెళ్తే హత్నూర మండలం కొన్యాల గ్రామానికి చెందిన చిలప్‌చెడ్ నవీన్ ఫేస్‌బుక్‌లో రూ.18వేలకు స్కూటీ అనే పోస్టును చూసి ఆ ఫోన్‌నంబర్‌ను సంప్రదించాడు. సదరు వ్యక్తి నవీన్‌కు కాల్‌చేసి స్కూటీ ఆర్‌సీని వాట్సాప్‌కు పంపుతున్నా.. డబ్బులు పంపించాలని అకౌంట్ నంబర్ ఇచ్చాడు. దీంతో నవీన్ మొబైల్ నుంచి రూ.12,000వేలు చెల్లించాడు. సదరు వ్యక్తి అదనంగా డబ్బులు పంపిస్తేనే స్కూటీ అమ్ముతానని చెప్పడంతో మూడుదఫాలుగా రూ.75వేలు పంపించాడు. ఆతర్వాత అతడికి ఎన్నిసార్లు ఫోన్‌చేసినా కలవలేదు. ఫేస్‌బుక్ అకౌంట్‌ను సైతం తొలిగించినట్లు గుర్తించి మోసపోయానని నవీన్ వెంటనే సైబర్‌క్రైం టోల్‌ఫ్రీ నంబర్ 1930కి ఫిర్యాదు చేశాడు. బుధవారం హత్నూర పోలీసులకు సైతం సమాచారం ఇచ్చాడు. హత్నూర ఎస్‌ఐ సుభాష్ సైబర్‌క్రైం పోలీసులతో మాట్లాడి టోల్‌ఫ్రీ నంబర్‌కు చేసిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## 'బైపాస్ వద్దు.. మా భూములివ్వం'

రామాయంపేట, జనవరి 3: మెదక్-ఎల్కతుర్తి రోడ్డులో రామాయంపేట పట్టణానికి చెందిన రైతులు బైపాస్ రోడ్డు కారణంగా భూములు కోల్పోతుండడంతో రోడ్డు పనులను నిలిపేశారు. విషయం తెలుసుకున్న మెదక్ ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్ బుధవారం రామాయంపేటకు చేరుకొని భూములను పరిశీలించారు. విషయం తెలుసుకున్న భూబాధితులు అక్కడికి చేరుకుని తమ భూముల నుంచి రోడ్డు వేస్తే ప్రాణాలైనా ఇస్తాం తప్ప తమ భూములను ఇవ్వమని తేల్చి చెప్పారు. మెదక్ - ఎల్కతుర్తి వరకు లేని బైపాస్ రోడ్డు రామాయంపేటకు ఎందుకని ప్రశ్నించారు. రామాయంపేట నుంచి వెళ్లే రోడ్డు పట్టణం నుంచే వెళ్లాలని గోడు వెల్లబోసుకున్నారు. ఇప్పటికే రామాయంపేటలో వ్యాపారాలు నడవక వలస వెళ్తున్నారని, బైపాస్ వల్ల రామాయంపేట ఉనికి పూర్తిగా కోల్పోతుందని వాపోయారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ మెదక్-ఎల్కతుర్తి రోడ్డులో భాగంగా భూములు పోతుంది వాస్తవమేనని, రామాయంపేట రోడ్డులో పోతున్న 10 గ్రామాల్లో త్వరలోనే భూసేకరణ చేపడుతామని తెలిపారు. ఈ విషయమై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఆర్డీవో వెంట రామాయంపేట తహసీల్దార్ రజినీకుమారి, ఆర్ఐ.రాజు తదితరులు ఉన్నారు.

## 'ప్రజాపాలన'ను సద్వినియోగం చేసుకోవాలి

అల్లాదుర్గం, జనవరి 3 : అర్హులైన ప్రతి ఒక్కరూ అభయహస్తం కోసం దరఖాస్తులు చేసుకోవాలని మెదక్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా బుధవారం అల్లాదుర్గంలో ప్రజాపాలనను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెల్లరేషన్ కార్డు లేకున్నా అర్జీదారులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమం బుధవారంతో ముగిసినప్పటికి ఇంకా దరఖాస్తులు వస్తుండడంతో ఈ నెల 4 వరకు 8 కౌంటర్లతో కొనసాగించాలని ఆదేశించారు. అలాగే, స్థానిక కేజీబీవీను తనిఖీ చేసి విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రజాపాలన నియోజకవర్గ ప్రత్యేకాధికారి సాయిబాబా, మండల ప్రత్యేకాధికారిణి కరుణ, తహసీల్దార్ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

# దుబ్బాకను ఆకుపచ్చగా మారుస్తాం

- మల్లన్నసాగర్ పనులను వేగంగా చేపట్టాలి
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- మల్లన్నసాగర్ కాల్వల నిర్మాణ పనుల పరిశీలన



మల్లన్నసాగర్ కాల్వకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, జనవరి 3: మల్లన్నసాగర్ కాల్వలను పూర్తిచేసి దుబ్బాకను ఆకుపచ్చ తివాచీగా తీర్చిదిద్దటమే తమ లక్ష్యమని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. దుబ్బాకలో మల్లన్నసాగర్ కాల్వల నిర్మాణంలో పలుచోట్ల జాప్యం జరుగుతుండటంపై అసహనం వ్యక్తం చేశారు. బుధవారం దుబ్బాక మండలం పోతారం, గంభీర్‌పూర్, అచ్చుమాయిపల్లి గ్రామాల మీదుగా నిర్మిస్తున్న కాల్వల పనులను మల్లన్నసాగర్( ఇరిగేషన్) అధికారులతో కలిసి వాహనాన్ని స్వయంగా నడిపిస్తూ పరిశీలించారు. మల్లన్నసాగర్ నుంచి 4ఎల్ ప్రధాన కాల్వకు అనుసంధానంగా సుమారు 15 కి.మీ పొడవుతో నిర్మిస్తున్న చిన్న కాల్వల పనులు, మ్యాప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే లక్ష్యంగా కేసీఆర్ సర్కారు ఎంతగానో కృషి చేసిందన్నారు. కాళేశ్వరం, మల్లన్నసాగర్ ప్రాజెక్టులు దేశానికే ఆదర్శంగా నిలిచాయని చెప్పారు. సాగునీటి కష్టాలను శాశ్వతంగా పరిష్కరించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. మల్లన్నసాగర్‌తో దుబ్బాక నియోజవర్గంలో బీడు భూములు సస్యశ్యామలమయ్యాయన్నారు. ప్రాజెక్టు ప్రధాన కాల్వల నుంచి పొలాలకు సాగునీరందించేందుకు చిన్న కాల్వలను నిర్మించినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కాల్వల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులకు ఆదేశించారు. 6న కలెక్టరెట్‌లో నీటి పారుదల శాఖ అధికారులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాల్వల నిర్మాణ పనులపై వారానికోసారి రివ్యూ మీటింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కాల్వల నిర్మాణంలో భూములు కోల్పోతున్న పలువురు రైతులకు నష్ట పరిహారం అందలేదని తమ దృష్టికి వచ్చిందని, వారికి ప్రభుత్వపరంగా న్యాయం జరిగేలా చూస్తామన్నారు. 6 నెలల్లో కాల్వల నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. యాసంగికి నీరందించేందుకు చర్య లు చేపడుతున్నామన్నారు. 4ఎల్ ప్రధాన కాల్వ నుంచి నిర్మిస్తున్న చిన్న కాల్వల ద్వారా దుబ్బాక మండలంలో సుమారు 30 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని తెలిపారు. మల్లన్నసాగర్ దుబ్బాక, సిద్దిపేట నియోజకవర్గాల రైతులకు వరప్రదాయినిగా మారిందని ఎమ్మెల్యే అభివర్ణించారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఈఈ వేణుబాబు, ఏడబ్ల్యూఈ తిరుపతి, డీఈఈ శ్రీకాంత్, సర్పంచ్‌లు జనార్దన్‌రెడ్డి, భాస్కర్, నాయకులు కిషన్‌రెడ్డి, శ్రీనివాస్, స్వామి, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ బడిని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, జనవరి 3: దుబ్బాకలో అద్భుతంగా నిర్మించిన కేసీఆర్ బడి భవనాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోలేకపోతున్నామని, ఇకముందు కేసీఆర్ బడిలో డిగ్రీ కళాశాల నిర్వహించేందుకు చర్యలు చేపడుతామని, ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చేందుకు కృషి చేస్తామని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మధ్యాహ్నం దుబ్బాకలోని కేసీఆర్ బడిని ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల భవనంలో ఉన్నత పాఠశాలతోపాటు జూనియర్ కళాశాల కొనసాగుతున్నాయి. విద్యార్థుల హాజరుశాతం, ఉపాధ్యాయుల వివరాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. జూనియర్ కళాశాలలో అరకొరగా విద్యార్థులుండటం, తరగతి గదులు అపరిశుభ్రంగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. భవనంలో కేవలం 30 శాతం మాత్రమే వినియోగంలో ఉందని, మిగిలిన 70 శాతం తరగతి గదులు, ఫర్నిచర్ తదితర విద్యావసతులు నిరుపయోగంగా మారాయన్నారు. అక్కడినుంచి దుబ్బాక, రాజక్కపేట ఆర్అండ్‌బీ డబుల్ రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. ఈ రోడ్డు విస్తరణతో తమ ఇండ్లను, ఖాళీ స్థలాలను కోల్పోతున్నామంటూ పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆస యాదగిరి, ఆస స్వామి, నాయకులు రొట్టే రాజమౌళి, గన్నే భూంరెడ్డి, కిషన్‌రెడ్డి ఉన్నారు.

## ఇచ్చిన హామీలను అమలు చేయాలి



అభయహస్తం దరఖాస్తును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్, జనవరి 3: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసి ప్రజల ముందుకు రావాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. బుధవారం జహీరాబాద్ మండలంలోని అనెగుంట గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కౌలు రైతులకు రైతుబంధును వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలుచేసే వరకు ప్రజలపక్షాన పోరాడుతామన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ తహసీల్దార్ రవీందర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.గుండప్ప, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, ఇప్పెపల్లి పీఏసీఎస్ చైర్మన్ మచ్చందర్, చిన్నారెడ్డి తదితరులు ఉన్నారు.

## బీఆర్‌ఎస్ హయాంలో పంచాయతీల అభివృద్ధి

శివ్వంపేట, జనవరి 3: కేసీఆర్ సర్కార్ హయాంలో ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన రూ.20లక్షలతో పూర్తి చేసిన సికింద్లాపూర్ గ్రామ పంచాయతీ భవనాన్ని బుధవారం సర్పంచ్ ఏనుగు సుధాకర్ రెడ్డితో కలసి ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ సర్కార్ మండలంలో 18 గ్రామ పంచాయతీలకు పక్కా భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందని, వాటి శంకుస్థాపనలు పూర్తయ్యాయని తెలిపారు. గతేడాది జూన్‌లో పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేయగా సర్పంచ్ ఏనుగు సుధాకర్‌రెడ్డి పట్టుదలతో ఎనిమిది నెలల్లోనే పూర్తి చేయించారు. సర్పంచ్ కృషి అభినందనీయమని, ఇతర గ్రామాల సర్పంచ్‌లు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహిపాల్‌రెడ్డి, పీఆర్ఏఈ భాస్కర్‌రావు, శ్రీశైలంయాదవ్, యాదాగౌడ్, చింతస్వామి తదితరులు ఉన్నారు.



సికింద్లాపూర్ పంచాయతీ ఎదుట ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, తదితరులు

## ఛత్రపతి శివాజీ ఆదర్శప్రాయుడు

గుమ్మడిదల, జనవరి 3: ఛత్రపతి శివాజీ పోరాటపటిమ, ఆయన చూపిన స్ఫూర్తి నేటికీ ఆదర్శనీయమే అని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన గుమ్మడిదలలో జీవీఆర్ ఎంటర్‌ప్రైజెస్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని బుధవారం ఘనంగా ఆవిష్కరించారు. అనంతరం గుమ్మడిదలలో వర్తకసంఘం భవనంపై నిర్మించిన మొదటి అంతస్తును ప్రారంభించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పడమటి లక్ష్మారెడ్డి, కమిటీ సభ్యులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్మించిన హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఎంపీపీ సద్దిప్రవీణావిజయభాస్కర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మంజుల వెంకటేశ్‌గౌడ్, సర్పంచ్ చిమ్ముల నర్సింహారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్ రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహ్మద్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటా..**

బీఆర్‌ఎస్ కార్యకర్తలను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ గుమ్మడిదల మండల అధ్యక్షుడు మహ్మద్‌హుస్సేన్ జన్మదిన వేడుకలకు హాజరయ్యారు.

## కానిస్టేబుల్ ప్రభాకర్‌కు సన్మానం



కానిస్టేబుల్‌ను సన్మానిస్తున్న అదనపు ఎస్పీ మహేందర్

మెదక్ అర్బన్, జనవరి 3: రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్ పోటీలో రజత పథకం సాధించిన ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్ ప్రభాకర్‌ను జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నెల 30, 31 తేదీల్లో గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్ పోటీల్లో జిల్లా పోలీస్ కానిస్టేబుల్ ప్రభాకర్ రాష్ట్ర స్థాయిలో రెండోస్థానంలో నిలిచి జిల్లాకు మంచి పేరు తెచ్చారన్నారు.